మరో ప్రపంచ ప్రమాదం!!

డా॥ పెందుర్తి మాస్టర్జీ

బొంబాయి షణ్ముఖానంద హాలులో...

రాత్రి ఎనిమిది గంటలయింది. రంగుల తోరణాలతో, వివిధరకాలయిన విద్యుద్దీపాలతో కోలాహలంగా వుంది.

డిఫెన్స్ మినిస్టర్, టెక్నికల్ యింజనీర్లు, ఓషనిక్ రిసెర్చి ప్రొఫెసర్లు, నావి ఆఫీసర్లు, ఓషనాలజి చదివిన రిసెర్చిస్టులు ఎందరో ఆ హాలులో సమావేశమయ్యారు.

కార్యక్రమం ప్రారంభమయింది.

"డియర్ ఫ్రండ్స్. ఇప్పుడు మీకు టెక్నికల్ ఇంజనీర్ ప్రొఫెసర్ జాన్సన్‌ను పరిచయం చేస్తున్నాను."

అనటంతో జాన్సన్ వేదికపైకి ఎక్కాడు. తన సీట్లో కూర్చుంటూ అందరికి నమస్కరించాడు.

"ఈ ప్రపంచ చరిత్రలో ఒక ప్రముఖమయిన మిషనరీ జాన్సన్ తయారుచేశారు. 'వాగ్ 15' అని ఆ మిషన్‌కి నామకరణం చేశాం. దానిని గురించి జాన్సన్ మాట్లాడతారు."

జాన్సన్ మైక్ దగ్గరకు నడిచి గొంతు సవరించుకొని అంతా కలయచూశాడు.

"జంటిల్‌మన్. మన భూమియొక్క విశాలత 197 మిలియన్ల స్క్వేర్ మైళ్ళు. అయితే 71 పర్సెంట్ నీటి భాగంతోనే వుంది. మిగిలింది భూభాగం. అయితే సముద్రపు అడుగున అంతులేని అగాధాలు వున్నాయి అని విన్నాము, వింటున్నాము. ఒక క్యూబిక్ మైలు సముద్రంలో 20 కిలోల బంగారం, 1000 కిలోల వెండి, 15 కిలోల మెర్క్యూరి, 14 టన్నుల రాగి, 9 టన్నుల మాంగనీసు వున్నాయి. ఇవి కొన్ని ప్రత్యేక ప్రయత్నాలతో సాధిస్తున్నాము.

అయితే, వాగ్ 15 ఉపయోగం ఏమిటి? వాగ్ 15 మూడు భాగాలుగా మూడు ఆపరేటింగ్ పిస్టన్స్‌తో వుంటుంది. ఈ వాగ్ 15 సముద్రపు అడుగున ఐమిన్ సిబెడ్ పైన వుంచి మొదటి పిస్టన్ నొక్కినపుడు, తన చుట్టూవున్న నీరు 100 మీటర్ల దూరంవరకు వెళ్ళిపోతుంది. అంటే ఏ ఆధారం లేకుండా నీరు తాబేలు టెంకి బోర్లించినట్లు అర్థభాగం గ్లోబ్‌లా వుంటుంది. వాగ్ 15 వుంచిన వందమీటర్ల సర్కిల్‌లో అసలు నీరు వుండదు.

రెండవపిస్టన్ నొక్కినపుడు ఆ వందమీటర్ల స్పేస్‌లో ఆక్సిజన్ వస్తుంది. అంటే కొందరు ఆ స్థలంలో నిరాటంకంగా భూమిమీద ఎలాగయితే పని చేయగలుగు

తున్నారో, అలాగే సముద్రంయొక్క అడుగున కూడా యీ వాగ్ 15 సహాయంతో పని చేయగలుగుతారు. అండర్ వాటర్ ప్రాజెక్ట్కు ఈ వాగ్ 15 సహకరిస్తుందని నా అభిప్రాయం.

ఇకపోతే థర్డ్ పిస్టన్...యిది చాలా స్లోగా ఆపరేట్ చెయ్యాల్సి వుంటుంది. ఇది ఆపరేట్ చేస్తూ వుంటే క్రమంగా చుట్టు నెట్టివేయబడ్డ నీరు కలుసుకుంటుంది. ఇది షుమారు మూడు సంవత్సరాల కృషి ఫలితం" అంటూ మరో కొన్ని మాటలు చెప్పి ముగించాడు.

డిఫెన్స్ మినిస్టర్ లేచి "ఈ వాగ్ 15ను బ్రిటన్ తీసుకుంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ వాగ్ 15కు ప్రశంసలందాయి. ఇది మన దేశానికే ఒక గర్వకారణం" చెప్పాడు.

ఆ తరువాత పలువురు ప్రశంసించారు.

జాన్సన్ కు భారతదేశానికి చెందిన విలువయిన బిరుదు యిచ్చారు.

పూలమాలలతో జాన్సన్ ను సత్కరించారు.

ప్రేక్షకులలో చివరివరుసలో ఒంటరిగా కూర్చున్న ప్రొఫెసర్ దీర్ఘనాథ్ పెదవులు బిగించి నవ్వాడు. ప్రయత్న పూర్వకంగా చప్పట్లు కొట్టాడు.

ప్రొఫెసర్ దీర్ఘనాథ్ కెమిస్ట్రీ రిసెర్చి లేబరేటరీలో జీనియస్ సైంటిస్టు. వయసు నలభైకి పైగా వుంటాయి. నావి బ్లూ సూటులో, ఆరడుగుల ఎత్తుగల రష్యన్ దేశస్తుడులా వుంటాడు. కళ్ళకు తెల్ల అద్దాల నల్లకళ్ళ జోడు, గడ్డం చిన్నగా వుంటుంది. విశాలమయిన నుదురు,

వుంగరాల తల, మనిషి గంభీరంగా గుంభనంగా వుంటాడు
టైము చూశాడు మెల్లగా కదిలి బయటకు నడిచాడు

2

"హలో కమేండర్. గుడ్ మార్నింగ్" అన్నాడు సంపత్ లోపలికి వస్తూ.

"గుడ్ మార్నింగ్ మైబాయ్, కూర్చో," అన్నాడు దీర్ఘనాథ్ నవ్వుతూ.

సంపత్ కూర్చొని సిగరెట్ వెలిగించాడు.

"డియర్ సంపత్! మన బృందం మొత్తం ఆరుగురు. వాళ్ళందరిని మన కార్యక్రమాల అనంతరం పరిచయం చేస్తాను."

సంపత్ ప్రశ్నార్థకంగా చూశాడు.

దీర్ఘనాథ్ నవ్వాడు. "మైబోయ్ మన కార్యక్రమం జయప్రదం అయ్యేవరకు మీరంత ఒకరికి ఒకరు పరిచయం శ్రేయోదాయకం కాదు. అందుకే ఒక్కొక్కరిని ప్రత్యేకంగా కలుసుకుంటున్నాను."

సంపత్ తృప్తిగా నవ్వి "దటీజ్ గుడ్ ఐడియా కమేండర్."

"ఇప్పుడు నీవు చేయవలసింది అతి ప్రమాదకరమయింది, మన కార్యక్రమానికి అతి ముఖ్యమయింది. నీవు క్రితంలో స్మగులింగు వ్యవహారాలలో కొన్ని రోజులు సముద్రంపై గడిపావు. అందుకే ఈ కార్యక్రమానికి నిన్నుపయోగిస్తున్నాను. జయప్రదం చేయగలవనే నమ్మకం నాకుంది."

"థాంక్యు కమేండర్. ఇంతకు కార్యక్రమం ఏమిటి?"

"వాగ్ 15 గురించి పత్రికల్లో చదివి వుంటావు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వాగ్ 15. దానివల్ల ప్రపం

చానికి ఎలాంటి వుపయోగం వుందో, అది మన చేతుల్లోనికి వచ్చాక అంతకంటె గొప్ప ప్రమాదం వుంది."

సంపత్ కుతూహలంగా వింటున్నాడు.

"ఎలాంటి ప్రమాదమో తరువాత చెపుతాను. ప్రస్తుతం ఫిబ్రవరి 26వ తేదీన మేఘదూత అనే స్పెషల్ షిప్‌లో అది గ్రేట్ బ్రిటన్‌కి పంపబడుతుంది. మేఘదూత షిప్‌లో, అందిన సమాచారాన్నిబట్టి ఇరవైమంది సెక్యూరిటి సిబ్బంది మిషన్‌గన్స్‌తో వుంటారు. ఈ షిప్‌ను చాలా జాగ్రత్తగా స్కేటర్ చేయవలసి వుంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా మన పథకం తారుమారవుతుంది.

కాబట్టి, చాలా తెలివిగా నీవు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలి. ఇది హార్బర్ దాటాక రెండువందల యాభై కిలోమీటర్లు వెళ్ళాక షిప్‌ను అకుపై చెయ్యాలి. ఈలోపు ఏంజరిగినా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, సెక్యూరిటి సర్వీస్ ముట్టడిస్తారు. అంతేకాదు మీరు వాగ్ 15 కొరకు వెళుతున్నట్లు ఎవరికి తెలియకూడదు. కనీసం నీ అనుచరులకు కూడా."

"అలాగే కమేండర్."

"ఇదిగో లక్షరూపాయలు అడ్వాన్సు. పథకం ఎలా వేస్తావో, ఎలాంటి మనుషులతో బయలుదేరతావో, ఎలా సాధిస్తావో నీ యిష్టం. నీవు జయప్రదం చేశావా, మరో రెండు లక్షలు యిస్తాను. లేదా నీ ప్రాణానికే ప్రమాదం"

"యస్. కమేండర్."

"వాగ్ 15 సంపాదించాక యాభై కిలోమీటర్లు యీస్టుగా వస్తే అక్కడ సబ్‌మిరైన్ సిద్ధంగా వుంటుంది. వాగ్ 15 ను అందులో ఎక్కించి, డైనమేట్‌తో షిప్‌ను

పేల్చివేయాలి. ఆ తరువాత మార్చి 15వ తేదిన హోటల్ న్యూగార్ రూం నెంబర్ 22లో రాత్రి పదిగంటలకు సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి హాజరు కావాలి."

"యస్. కమేండర్."

"విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ మైబోయ్" అన్నాడు దీర్ఘనాథ్. సంపత్ కదిలాడు.

3

బొంబాయి, మహాత్మగాంధిరోడ్‌లో, జె అండ్ కె గవర్నమెంట్ రూపొందించిన టూరిజం హాలు. "డైరక్టర్ ఆఫ్ టూరిజమ్ జె అండ్ కె గవర్నమెంట్, శ్రీనగర్" అని వుంటుంది.

దీర్ఘనాథ్ సిగర్ వెలిగించి లోపలకు నడిచాడు.

"వసంతం మిమ్మల్ని కాశ్మీరు ఆహ్వానిస్తుంది-కాశ్మీరులో ప్రకృతి సౌందర్యాన్ని తిలకించండి. గుల్మర్గా హైయస్ట్ గల్ఫ్‌ను దర్శించండి."

ఇలాంటి బోర్డులు అక్కడక్కడ తగిలించి వున్నాయి.

ట్రేడ్ ఏజెంట్ అనంత్, దీర్ఘనాథ్‌ను చూశాడు. పలకరింపుగా నవ్వాడు. దీర్ఘనాథ్ గాగుల్స్ తీసి తల వూపాడు. అనంత్ కదిలాడు. ఇద్దరు ప్రక్కనేవున్న లాన్‌లో కూర్చున్నారు.

దీర్ఘనాథ్ సిగరెట్ కేసు అందించాడు.

అనంత్ సిగరెట్ కేసు తీసుకొని అందులో మడచి వున్న కాగితం చూశాడు.

అనంత్ ఆశ్చర్యంగా చూశాడు. దీర్ఘనాథ్ నవ్వాడు.

"డియర్ అనంత్ నీది చాలా ప్రమాదంతో కూడిన

పని. ఈ కాగితాన్ని కొన్ని లక్షల కాపీలు అచ్చు వేయించాలి. ఇందులో ఒక్క అక్షరం తీయకూడదు. ఈ కాగితాలు దేశవ్యాప్తంగా పంచటం జరగాలి. ఈ పేపరు ప్రింట్ చేయడానికి రహస్యమయిన ప్రెస్ సిబ్బంది కావాలి. ఇదిగో 3 లక్షలు'' టీపాయిపైన వుంచాడు. అనంత్ అందుకున్నాడు.

''ఈ మూడు లక్షలతో కొన్ని లక్షలమంది పిచ్చి వాళ్ళయి పోవాలి. మన పథకం గురించి ఇదివరలో నీకు చెప్పాను. ఇకపై ఆచరణలో మన కార్యక్రమాన్ని సాధించాలి.''

''యస్ కమేండర్.''

''విష్ యు బెస్ట్ ఆఫ్ లక్!''

4

రాత్రి పదిగంటలయింది. కేరళ స్టేట్‌లో టూటికురన్ షిప్ యార్డ్‌లో కుడివైపు నియాన్ లైటుకాంతితో వెలుగుతున్నాయి. అది సిక్ యార్డ్ కాబట్టి విరిగిపోయిన స్టీమ్‌బోట్ ముక్కలు, రా మెటీరియల్స్ వున్నాయి. షిప్‌లో కొన్ని భాగాలు వున్నాయి. చుట్టు ముళ్ళతీగతో కట్టిన బౌండరి వుంది.

సిక్ యార్డ్ ప్రక్కనే వుంది సెక్యూరిటీ గొడవున్.

సెంట్రీ డ్యూటీలు చేస్తున్న నలుగురు సెక్యూరిటీ సిబ్బంది తిరుగుతున్నారు. ఎలుక నడిచినా, పిల్లి కదిలినా రప్పవేయకుండా జాగ్రత్తగా చూస్తుంటారు. ఎడమవైపు లైట్‌హౌస్ వుంది.

ముళ్ళతీగ కట్ చేశాక లోపల ప్రవేశించిందొక యువతి.

తెల్లచీర కట్టుకొని పరుగెత్తుకుంటూ వస్తోంది ఆమె.

"ఎవరు? ఎవరది?" సెంట్రీ అరిచాడు.

దాంతో అందరు ఎలర్ట్‌గా వున్నారు. గన్స్ స్టడీ చేశారు. ఏమ్ పెట్టారు. అయినా ఆ యువతి ఆగకుండా "కాపాడండి కాపాడండి" అంటూ అరుస్తూ వస్తోంది.

ఈలోపు ఓ టేప్ రికార్డర్ మరొక ప్రక్క వుంచింది. ఆ అమ్మాయి వారినే సమీపించింది. "కాపాడండి," అని అరుస్తూనే వుంది.

మరొక దిశగా బూటుకాళ్ళతో పరుగెడుతున్న శబ్దం. అది టేపురికార్డర్ అని వాళ్ళకు తెలీదు. అందుకే వాళ్ళలో ఇద్దరు సెంట్రీలు అటువైపుకు వెళ్ళారు.

అంతా నిశ్శబ్దంగా వుంది. పరుగెడుతున్న శబ్దం షిప్ యార్డు అంతా వినిపిస్తోంది.

దినేష్ సైలెన్సర్ బయటకు తీశాడు. ప్రక్కనే అతని అనుచరుడు వున్నాడు. ఆ ఇద్దరూ ఆ యువతి వెనుకనే పొంచి వుండి వస్తున్నారు.

"ఏమిటి?" సెంట్రీ అడిగాడు.

"ఎవరో ఆగంతకులు నన్ను వెంబడిస్తున్నారు" అంది ఆమె కంగారు నటిస్తూ, ముఖమంతా చెమటలు పోశాయి.

మరొకప్రక్క హాహాకారం టేప్‌రికార్డర్ నుండి వినిపించింది. క్షణంలో ఆమె చేతిలో రివాల్వర్, దినేష్ చేతిలో సైలెన్సర్ ఒక్కసారిగా పేలాయి. యిద్దరు సెంట్రీలు నేల కూలారు. వాళ్ళిద్దరూ కాల్చటంలో ఏమాత్రం ఆలశ్యమయినా సెంట్రీల చేతుల్లో మిషన్ గన్స్ పేలి వుండేవి.

యింతలో దూరం వెళ్ళిన సెంట్రీలు తిరిగి వచ్చారు. మరుక్షణంలో వాళ్ళూ శవాలుగా మారారు.

అంతా నిశ్శబ్దమయింది.

సెంట్రీల నాలుగు శవాలు భయంకరంగా వున్నాయి.

ఆగంతకులు ముగ్గురు వేగంగా సెక్యూరిటీ రూం వైపు పరుగెత్తారు. రివాల్వర్‌తో తాళం పేల్చి లోపలకు ప్రవేశించారు.

చుట్టూ రాతి కట్టడం మధ్య నీరు నిండి వుంది. ఆ నీటిలో వుంది 'డీప్‌సన్' సబ్‌మెరైన్. సముద్రం వైపు యినుప చట్రం అడ్డుగా వుంది.

మీటర్ వెడల్పు చెక్క సబ్‌మెరైన్ డెక్‌మీదకు వేసి గబగబ సబ్‌మెరైన్‌ను సమీపించాడు దినేష్. రెండవ మనిషి డూప్లికేటు తాళంతో సబ్‌మెరైన్ డోర్ తెరిచాడు. ఆ యువతి అతడిని అనుసరించింది.

దినేష్ లోపల ప్రెషర్ హోల్‌లో మీటరు నొక్కాడు.

ప్రపెల్లర్ స్విచ్ ఆన్ చేశాడు. బుడ బుడ మనే శబ్దంతో నీటిపై తేలిన సబ్‌మెరైన్ కదిలింది. ఆటోమేటిక్‌గా యినుప చట్రం తెరుచుకుంది. డీప్‌సన్ డౌన్ చేసి నీళ్ళ అడుగుకు పోనిస్తూ పెరిస్కోపు మాత్రం పైకి కనిపించేలా మెల్లిగా డ్రైవ్ చేశాడు.

5

'మేఘదూత' షిప్ బయలుదేరటానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఇరవైమంది సెక్యూరిటీ సిబ్బంది మిషన్‌గన్స్‌తో షిప్‌లో ప్రవేశించారు. క్రేన్, ట్రక్‌లో వచ్చిన 'వాగ్ 15'ని ఎత్తి మేఘదూత షిప్‌లోనికి దించింది.

హార్బరి జనరల్ మేనేజర్ సింగ్ నడుంపై చేతులు పెట్టుకొని చూస్తున్నాడు.

కెప్టెన్ రాజేష్, అసిస్టెంట్ కెప్టెన్ మాధవ్, సింగ్ ప్రక్కగా వచ్చి సెల్యూట్ చేశారు.

"విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ మై బాయ్స్" అంటూ షేక్‌హాండ్ యిచ్చి, కవర్స్ చేతికి యిచ్చాడు. కవర్స్ అందుకొని షిప్‌లోనికి ప్రవేశించారు.

రాజేష్ అన్ని భాగాలు తనికీ చేశాడు. మాధవ్ మిర్రర్ పైవున్న ప్లాను మీద బటన్ వత్తాడు.

సిగ్నలింగ్ బెల్ మ్రోగింది. శబ్దం చేస్తూ మేఘ దూత బయలుదేరింది. సముద్రాన్ని చీలికలు చేస్తూ, నీటిపై తేలి, మహాసముద్రంలోనికి సాగిపోతూంది.

కెప్టెన్ రాజేష్ కాబిన్ రూంలోనికి నడిచి ముఖ్య మయిన భాగాలు చెక్‌చేసి, కంట్రోల్ రూంలోనికి నడి చాడు. మాధవ్ ఎదురయ్యాడు. "హలో సెక్యూరిటీ మాన్స్" అన్నాడు రాజేష్. ఇద్దరు కలిసి కంట్రోల్ రూం నుండి క్రింది పాసింజర్స్ రూంలోనికి నడిచారు.

కొందరు మిషన్ గన్స్ తుడుస్తున్నారు, మరికొందరు ప్లేయింగ్ కార్డ్సు ఆడుతున్నారు. యింకా కొందరు నిద్రకు ఉపక్రమించారు.

మాధవ్, రాజేష్ టైము చూసి కాబిన్ రూంలోనికి నడిచి స్పీడ్ ఎక్కించారు. మేఘదూత వేగాన్ని అందు కుంది.

* * *

బైనాక్యులర్స్‌తో మిరైన్ బోటులో నుండి చూశాడు సంపత్. చాలా దూరంలో కాగితపు పడవలా కనిపిం స్తూంది, మేఘదూత.

సంపత్ తన అనుచరులకు ఏదో సైగ చేశాడు,

యిరవై మంది గబ గబ స్క్యూబ్స్ ధరించారు. మిరైన్ ట్రాంగిల్‌లో మేఘదూతను సమీపిస్తుంది.

"నో" అన్నాడు సంపత్.

తటిళ్ళుమని ఒకరి తరువాత ఒకరు వాటర్‌లోనికి దిగారు. రబ్బరు కవర్స్, ఆక్సిజన్ సిలిండర్స్ ధరించిన అందరి చేతులలో ప్లాస్టిక్ క్లాత్ చుట్టిన మిషన్ గన్స్ వున్నాయి. ముఖాలకు మిర్రర్ లెన్స్ వున్నాయి. వేగంగా యీదగల సమర్థులు వాళ్ళు.

మేఘదూత మిరైన్‌ను సమీపిస్తుంది.

మాధవ్, కెప్టెన్ రాజేష్‌కు చెప్పాడు. కెప్టెన్ రాజేష్ బైనాక్యులర్స్‌తో చూశాడు. మిరైన్ షిప్‌లో ఒక్కడే కనిపించాడు. అతను కూడా చనిపోయినట్లు పడి వున్నాడు.

ఒకరి తరువాత ఒకరు క్రమంగా కుడి వైపు డెక్ మీదకు వచ్చి నిలబడి చూస్తున్నారు. ఎన్నో సందేహాలు ఎన్నో రకాల ఆలోచనలతో చూస్తున్నారు. మిరైన్‌ను సమీపించింది మేఘదూత.

అదే అవకాశంగా ఎడమవైపు తాళ్ళ నిచ్చెన మీదగా నిశ్శబ్దంగా ఎడమ వైపు డెక్ మీదకు ఎక్కారు అందరూ. ప్లాస్టిక్ కవర్స్ తీసి మిషన్ గన్స్ స్టడీలో వుంచారు, వరుసగా యిరవై మంది. ఎల్లో స్క్యూబ్ ధరించిన మనిషి 'ఫైర్' అన్నాడు. మిషన్ గన్స్ పేలాయి.

క్షణాలలో మేఘదూత వారి స్వాధీనం అయిపోయింది.

6

"థాంక్యూ, కమేండర్!" అంది లూసియా, డబ్బు అందుకుంటూ.

"నీకు చెప్పింది, యిరవై మంది యువకులు కావాలని. అయితే నీవు నలభై మందిని ఎలా తీసుకు వచ్చావ్?" అడిగాడు దీర్ఘనాథ్ ఆశ్చర్యంగా.

"వెరీ సింపుల్ కమేండర్! లెక్చరర్ మిస్ ఛాయ బర్త్ డే పార్టీకి హాజరయ్యాను. అన్ని డ్రింక్స్‌లో మత్తు మందు కలిపాను. తాగిన గంట తరువాత ఒక్కొక్కరు స్పృహ కోల్పోయారు. అందరిని వాన్‌లో మీరు చెప్పిన చోటుకు చేరవేశాను."

"గుడ్! నీ ఐడియా అమోఘం."

"వాళ్ళంతా ఎందుకు కమేండర్?"

దీర్ఘనాథ్ నవ్వాడు. "నీ ప్రశ్నకు హోటల్ న్యూగార్‌లో సమాధానం లభిస్తుంది. ప్రస్తుతం మనం అక్కడికే వెళ్ళాలి పద."

కారులో ఇద్దరూ న్యూగార్ హోటల్‌కి బయలు దేరారు.

రూం నెంబర్ యిరవై రెండులో ప్రవేశించా రిద్దరూ.

దీర్ఘనాథ్ టైము చూశాడు రాత్రి పది గంటలు అవుతుంది.

ఒక్కొక్కరు లోపల ప్రవేశిస్తున్నారు. ఆటోమేటిక్‌గా తలుపు మూసుకుంటుంది. అతి చల్లదనంలో వున్న ఎయిర్ కండీషన్ గది కావటంవల్ల ఆహ్లాదకరంగా వుంది. దానికి తగ్గట్టు యింపోర్టెడ్ సెంట్ వాసనతో పరిమళిస్తుంది ఆ గది.

అందరు తమ తమ సీట్లలో కూర్చున్నారు.

దీర్ఘనాథ్ ఓ కుర్చీలో కూర్చున్నాడు. "డియర్ ఫ్రండ్స్! యిప్పటివరకు మనం అనుకున్నవి సాధించాం,

యిప్పటివరకు మీరు నన్ను కమేండర్ అని పిలిచారు. కాని యిప్పుడు అసలు కమేండర్‌ని మీకు పరిచయం చేస్తున్నాను'' అనటంతో అందరు ఆశ్చర్యపోయారు.

''డియర్ ఫ్రెండ్స్! నా అవర్ గ్రేట్ కమేండర్ విశ్వామిత్ర'' అనటంతో డోర్ తెరిచి లోపల ప్రవేశించాడు, ప్రొఫెసర్ విశ్వామిత్ర.

యాభై ఏళ్ళ వయసుగల గంభీరమయిన మనిషి, గ్రే హెయిర్ తలకట్టు, కళ్ళకు తెల్ల అద్దాలు. ఆరడుగుల ఎత్తు. చూపరులకు మహా మేధావిలా కనిపిస్తాడు. రెడ్ కలర్ ట్వీడ్ సూటులోవున్న విశ్వామిత్ర కెమికల్ రిసెర్చిలో ప్రభుత్వ బహుమతి పొందిన మనిషి.

''జంటిల్‌మన్ దిస్ యీజ్ గ్రేట్ డే టు అవర్స్ ఓన్లీ, మనకు మంచిరోజయిన ఈరోజు ప్రపంచానికి చెడు రోజు. ఎలా? ఎందుకని? మన పథకం ప్రకారం సృష్టిని నాశనం చేయబోతూ వున్నాం.''

అందరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

''అంటే మనం విశ్వామిత్రుడిలా అపరసృష్టి చేయబోతున్నాం. ఈ నడుస్తున్న చరిత్రలో మానవ ఆత్మలు మలినమయిపోతున్నాయి. మనిషి మనిషిగా బ్రతకటం మరచిపోయి మగువ, మత్తులో పిచ్చివాడయి, నీచాతినీచాలు చేస్తున్నాడు. రోజురోజుకు యీ భూమిని మలిన పరుస్తూ, అవినీతి కందకాల్ని త్రవ్వుతున్నాడు. దైవం పేరుతో మోసాలు చేస్తూ, స్వార్థం పేరట ధనానికి దాసోహమయి, పదవుల పేరట ప్రజల్ని దోచి, పాపాత్ముడైపోతున్నాడు.

'సంభవామి యుగే యుగే' అని ఎందరు ఈ భూమి

మీద అవతరించినా, ఎన్ని మతగ్రంథాలు రచించినా, ఈ మానవుడు దానవత్వం మానటం లేదు. అందుకే ఈ దేవుళ్ళు, యీ మతగ్రంథాలు, సమాజసిద్ధాంతాలు అంతరించి పోవాలి. ఎలా?

ది గ్రేట్ పాయిజన్ 'కార్ట్రిడాన్' యీ విష పదార్థంతో సృష్టిలో మానవుడు మిగలడు. మిగిలేది— కేవలం మనం, మన అనుచరులు.

అందుకే ఈ విశ్వామిత్ర పథకాన్ని సముద్రగర్భంలో చేయటానికి నిర్ణయించాం. కాబట్టి వాగ్ 15, ఒక డీప్ సన్ సబ్ మెరైన్ మనకు అవసరమయింది. ఈ కార్యక్రమంలో కొందరు యువతులు కావాలి. యువతుల్ని తీసుకువెళ్ళటం జరిగింది. ఆ యువతులు కనే పిల్లలతోనే యికపై సృష్టిని నడుపుతాం. ఇదీ మన పథకం. మీరు వెంటనే మన స్థావరానికి సబ్ మెరైన్‌లో బయలుదేరండి" విశ్వామిత్ర వుపన్యాసం ముగించాడు.

7

ప్రతి నగరంలో కరపత్రాలు పంచబడ్డాయి. అమాయకులయిన కిరాయి పిల్లల చేతులనుండి కుతూహలంగా కరపత్రాలు అందుకుంటున్నారు. దేశవ్యాప్తంగా నగ్గోలు ప్రారంభమయింది. పత్రికా విలేకర్లు కరపత్ర వివరాలు ప్రచురిస్తున్నారు. కొందరు అది జోక్ అనుకున్నా, విశ్వామిత్ర ప్రొఫెసర్ గురించి విన్న చాలామంది అది యదార్థమేమో అనుకుంటున్నారు.

"మహాప్రజలారా!

ఈ సృష్టిని, మీ అందర్నీ సర్వనాశనం చేస్తున్నందుకు క్షమించండి. "మీలో ఎందరో మంచివాళ్ళు వున్నా

కొందరు దుర్మార్గులు వుండటంవల్ల, ఈ సృష్టినే నాశనం చేస్తున్నాను. ఈ సృష్టిని తీర్చి దిద్దింది భగవంతుడయితే, దానిని నాశనంచేసి మరొక సృష్టి రూపొందిస్తుంది విశ్వామిత్ర ఒక్కడే.

కామాన్ని చంపుకోలేనివాళ్ళు, కడుపు కొరకు పడుపు వృత్తి చేసేవాళ్ళు, కష్టపడకుండా లక్షలు దాచేవాళ్ళు, ఆ లక్షలతో మిమ్మల్ని మీరు పీక్కుతినేవాళ్ళు యికపై వుండరు.

నా విశ్వామిత్ర పథకంలో మిగిలేది మేము, మా అనుచరులు మాత్రమే. మీకు మృత్యువు ఏ రూపంలో వస్తుందో ఎవరికి తెలీదు. కలియుగం చివరి పాదం నా చేతిలో వుంది. లోకాంత్యం మిమ్మల్ని ఆహ్వానిస్తుంది.

ఒక్కమాట వేలమంది మేధావులు, లక్షలమంది సైంటిస్టులు, కోట్లమంది ప్రొఫెసర్లు, కోటానుకోట్లమంది కెమిస్టులు నా పాయిజన్‌కి ఏంటి పాయిజన్ తయారు చేయలేరు. గుడ్ బై ఆల్ ఆఫ్ యూ.

—ప్రొఫెసర్ విశ్వామిత్ర."

ఈ కరపత్రం చదివిన ప్రతి నగరంలో కోలాహలం ప్రారంభమయింది. మృత్యువు అనేది ప్రతి మనిషికి గుర్తుకు వస్తుంది. పార్కుల్లో, హోటళ్లో, సినిమా హాలుల్లో యిదే సంభాషణ జరుగుతుంది. రకరకాల పత్రికలలో రకరకాల నిర్వచనాలు వినిపిస్తున్నాయి. రకరకాల సమావేసాలు జరుగుతున్నాయి.

క్రైస్తవులు లోకాంత్యం అంటున్నారు, హిందువులు కలియుగం ముగుస్తుంది అంటున్నారు. ఇంకా కొందరు యింకోలా అంటున్నారు. దేవుడు, నీతి అంటే తెలియని

ప్రతివాడు బ్రతికిపోవాలని తాపత్రయపడుతున్నారు. చస్తే స్వర్గానికి వెళ్ళాలనుకుంటున్నారు. అంతా క్షణికం అంటూ వేదాంతం చెప్పుకుంటున్నారు కొందరు.

మృత్యువు ఎలా వస్తుందో ఎవరికి తెలియటంలేదు.

8

బోయింగ్ 707 శాంతక్రూజ్ ఎయిర్‌పోర్టు చేరుకుంది. పాసింజర్స్ ఒక్కొక్కరు దిగుతున్నారు. అందరిమధ్య ప్రఖ్యాత డిటెక్టివ్ పి. జె. ట్వీడ్ షూట్‌లో దిగుతున్నాడు. అతని వెంటనే అసిస్టెంట్ ధర్మ వున్నాడు.

టెరస్ పైనుండి బైనాక్యులర్‌తో చూస్తున్నాడు సుందర్. ఆ డిటెక్టివ్ ప్రాణాలు తీయటానికి ప్రొఫెసర్ దీర్ఘనాథ్ నుండి అతడికి లక్ష అడ్వాన్సు ముట్టింది.

పదియిరవై నిమిషాలయింది.

డిటెక్టివ్లు యిద్దరు బయటకు వచ్చి ఇంపాలా కారు ఎక్కారు. కారు మెల్లగా హంసగమనంతో బయలుదేరింది. సుందర్ ఆతృతగా అంబాసిడర్ ఎక్కి వెంబడించాడు.

విక్టోరియారోడ్ మలుపు తిరిగింది ఇంపాలా కారు. అక్కడ ట్రాఫిక్ ఎక్కువగా వుంది. అందుకే ప్రక్కగా వున్న లామింగ్‌టన్‌రోడ్ మలుపు త్రిప్పి వేగంగా విక్టోరియారోడ్‌లో క్రాస్ చేశాడు. అప్పటికి యాభై అడుగులు వెనుకగా వుంది ఇంపాలా. తను వేగం తగ్గించాడు. ఇంపాలా వేగం ఎక్కింది.

బ్లూ డైమండ్ హోటల్ దాటుతూ వుంది.

తను క్రొత్తగా ఆ నగరాన్ని చూస్తున్న మనిషిలా చూస్తున్నాడు. సందేహంలేదు పి.జె. తనను గమనించటం లేదు.

విక్టోరియా రోడ్ లో ఖరీదయిన పురాతన భవంతులు, లైబ్రరీలు దాటి పార్క్ రోడ్ మలుపు తిరిగింది. రెడ్ సిగ్నల్ వెలగటంతో ఇంపాలా ఆగింది. సుందర్ మౌంట్ బాటన్ రోడ్డులో నుండి క్రాసుచేసి గ్లాస్కో లేబరేటరీ వున్న ఆనిబిసెంట్ రోడ్ క్రాసుచేశాడు. కరెక్ట్ ఇంపాలా ఫైఫ్టీ అడుగులు వెనుక వుంది.

జేబులోనుండి రివాల్వర్ తీశాడు. సైలెన్సర్ అటాచ్ మెంట్ చేశాడు. పదకొండు పన్నెండు నిమిషాలయింది.

చేతులు వణుకుతున్నాయి. భయంగా వుంది. ఇంకా ఇంకా మూడేనిమిషాల వ్యవధి వుంది. ఈ మూడు నిమిషాలలో హత్యజరగాలి. రివాల్వర్ ఏమ్ లో వుంచుకున్నాడు.

రోడ్డు విశాలంగా వుంది. ఇంపాలా దూసుకువస్తుంది. డ్రైవర్ ని భుజం తట్టాడు. డ్రైవర్ వెనుక వస్తున్న ఇంపాలాను చూసి స్లో చేశాడు. దానితో సమానంగా అనుసరించటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంపాలా సమీపించింది.

సుందర్ ముఖం పాలిపోయింది. ఇంపాలాలో డ్రైవర్ తప్ప ఎవరూ లేరు. మతిపోయినట్లయింది.

ఇంపాలాకు అడ్డంగా అంబాసిడర్ ఆపాడు. ఇంపాలా ఆగిపోయింది!

గబగబ అంబాసిడర్ నుండి దిగి సైలెన్సర్ చూపాడు.

"వాళ్ళను ఎక్కడ దించావ్?" కఠినంగా అడిగాడు. ఇంపాలా డ్రైవర్ నవ్వి వేలుపెట్టి చూపాడు. యాభై అడుగుల దూరంలో ఎల్లో టాక్సి బయట నిలబడి వున్నాడు వి. జె.

సుందర్ గుండెలో రైలుపట్టాల మోత మోగింది. తన

అంబాసిడర్ లోనికి దూరి పారిపోబోయాడు. కాని అప్పటికే పి. జె. అంబాసిడర్ టైరు పేల్చాడు. ఉపే క్షించకుండా సుందర్ పరుగెత్తుతున్నాడు. కారులో వున్న ధర్మ పరుగెత్తుతున్న సుందర్‌ని వెంబడిస్తున్నాడు.

పారిపోతున్న సుందర్ మెదడు మొద్దుబారిపోయింది. అయినా పరుగెడుతున్నాడు. ధర్మ రివాల్వర్ పేల్చాడు. సుందర్ వణికిపోయి సైలెన్సర్ క్రిందవదలి, చేతులు ఎత్తి నిలబడ్డాడు భయంగా.

అతడిని పట్టుకొని, పి. జె. దగ్గరకు తీసుకువచ్చాడు ధర్మ.

9

ప్రొఫెసర్ విశ్వామిత్ర, అసిస్టెంట్ దీర్ఘనాథ్ వరుసగా నిలబడ్డ సిబ్బంది ముందు నిలబడ్డారు. చుట్టూ బ్రహ్మాండ మయిన మిషనరీ వుంది.

లూసియా వెల్‌వెట్ యూనిఫాంతో వుంది. మిగిలిన సిబ్బంది అంతా వెండిలావున్న దుస్తులు ధరించారు.

"డియర్ ఫ్రండ్స్! మనం ఇప్పుడు సముద్రమట్టానికి రెండువేల అడుగుల లోతులో వున్నాం. కరెక్ట్‌గా చెప్పా లంటే డాగర్ మవుంటెన్ క్రింద వున్నాం. వాగ్ 15 సహాకారంతో డాగర్ మవుంటెన్ అడుగునవున్న ఈ బ్రహ్మాండమయిన గుహలో మనం పదిహేనురోజులు శ్రమ పడి స్థావరం ఏర్పరచుకున్నాం.

ఈ డాగర్ కొండలో మూడుభాగాలు, రెండు కేవ్స్ వున్నాయి. మూడుభాగాలలో ఒకటి రాకెట్ సెంటర్ ఆరు రాకెట్లు ఏర్పాటుకు ఆ భాగం. పోతే రెండు టెలివి

జన్ రూం, కంట్రోల్ రూం. ఇందులోనుండి అన్ని భాగాలు కనిపిస్తాయి. మూడవది మన రెసిడెన్స్. ఇక్కడ మనం వుంటాం.

ఇకపోతే రెండు కేవ్స్ ఒకటి మనం తెచ్చిన అమ్మాయిలకు ప్రత్యేకమయిన గదిలాంటిది. రెండు వాళ్ళను ఎంజాయ్ చేయటానికి రెండో కేవ్.

అయితే విషాదకరమయిన వార్త ఏమంటే రాత్రి మన సిబ్బందిలో ఒకమనిషి పారిపోటానికి ప్రయత్నించాడు. రాత్రి టెలివిజన్‌లో చూశాను. ఆ మనిషి యీ స్థావరం నుండి పారిపోటానికి ఎందుకు ప్రయత్నించాడు. ఎవరు ఏమయినా మీకు కావలసిన సదుపాయాలు యిక్కడ వున్నాయి. మనం ఒక కార్యక్రమం తలపెట్టాం. ఈ స్థితిలో పారిపోయాడంటే ఐ హేట్ దట్ బ్లడి మేన్. సెంబర్ 26'' పిలిచాడు.

''యస్ కమేండర్.''

''ఆ టబ్‌లో వున్న చేపను పట్టుకురా'' అన్నాడు విశ్వామిత్ర.

నెంబర్ ట్వంటీసిక్స్ గబగబ వెళ్ళి తొట్లో చెయిపెట్టి అరురంగులున్న చేపను పట్టుకున్నాడు. క్షణంలో వికృతంగా అరచి, కాళ్ళు చేతులు ఆడిస్తూ, క్రింద పడిపోయాడు. భయంకరంగా అరుస్తూ తన్నుకొంటూ చనిపోయాడు.

''డియర్ ఫ్రండ్స్ అది 'మురాండిరాగ్ ఫిగ్!' అంటే పాయిజన్ ఫిష్ అన్నమాట. ఆ ఫిష్ టచ్ అయితే అలాగే చనిపోతారు. ఇక్కడనుండి పారిపోవటానికి ఎవరు ప్రయత్నించినా యిదే ముగింపు,'' అన్నాడు విశ్వామిత్ర.

దీర్ఘనాథ్ ఓ స్విచ్ నొక్కాడు. "ఈ ఫిష్ తాకిన శవాన్ని మనం తాకకూడదు" అంటూ శవంవైపు తిరిగాడు. కంప్యూటర్ శవాన్ని పీత డెక్కతో పట్టినట్లు పట్టి తీసుకు వెళుతుంది.

10

డేని, గబ్బర్ సింగ్ బోటు నడుపుతున్నారు.

సముద్రం మధ్యలో చిన్న కాగితపు పడవలా వుంది. స్టీమ్‌బోటు వేగంగా దూసుకు వెళుతుంది. లోపల చాపలతో పాటు మినియేచర్ టేప్ రికార్డులు, వాచీలు, గోల్డ్ చైన్ వున్నాయి. సముద్రంమీద చల్లనిగాలి తెరలుగా వీస్తుంది.

ఉదయం పదిగంటలయింది.

సాయంకాలం నాలుగుగంటల ప్రాంతంలో తీరం చేరుకోవచ్చు అనుకున్నారు. అప్పటికి వందల మైళ్ళ ప్రయాణం జరిగింది. గబ్బర్ సింగ్ సిగర్ వెలిగించి చుట్టూ కలయచూస్తున్నాడు. డేని టిన్ పగలగొట్టి మిల్క్ త్రాగుతున్నాడు.

"డేని" పిలిచాడు గబ్బర్. డేని తలెత్తి గబ్బర్ చూస్తునవైపు చూశాడు. నీటిపై తేలాడుతున్న శవం. స్టీమ్‌బోటు మెల్లగా సమీపిస్తుంది.

ఇద్దరు నిశితంగా చూశారు.

ముఖం వికృతంగా వుంది. కళ్ళు ముక్కు పెదవులు చాపలు తినివేయటంవల్ల వికృతంగా వుంది.

* * *

మరునాడు ఉదయం కాఫిన్ బాక్స్ మూత తెరిచి చూశాడు పి. జె. "ఈ శవం మాకు మూడువందల డెబ్భై

మైళ్ళదూరంలో కనిపించింది,'' అన్నాడు గబ్బర్ వేలెట్ లోనుండి సిగరెట్ తీసి వెలిగిస్తూ.

ఇద్దరి ముఖాలలోనికి చూశాడు పి. జె.

''ఈ యూనిఫాంనుబట్టి, ప్రపంచ ప్రమాదపు స్థితి గతులనుబట్టి, ఇది మీ దగ్గరకు తీసుకువచ్చాం,'' అన్నారు ఇద్దరు.

''మీ రెవరు?''

భయంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

చూపులతో మనసులో భావాల్ని చదవగల పి. జెకి అర్థమయింది.

''మీకు అర్థమయ్యే వుంటుంది. స్మగ్లర్లు బిజినెస్, మమ్మల్ని అరెస్టు చేయరనే నమ్మకంతోనే మీ దగ్గరకు వచ్చాం.''

''యస్. కాని అది నా డ్యూటీ కాదు. కాని మీవల్ల ఓ సహాయంకావాలి,'' అన్నాడు కుషన్ లో కూర్చుంటూ. ఇద్దరినీ ఎదురుగా కూర్చోమన్నాడు. కూర్చున్నారు. ధర్మ నాలుగు గ్లాసులతో బీర్ తెచ్చి అందరికీ యిచ్చి, ఒకటి తను తీసుకున్నాడు.

''మీ ధైర్యం చాలా గొప్పది. ఈ శవంవల్ల, మాకు లభించిన సమాచారంవల్ల, శత్రువుల స్థావరం సముద్రం లోనే అని స్థిరంగా నిర్ణయించవచ్చు. కాబట్టి మీలాంటి సమర్థులు నాతో సహాకరించాలి.''

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

''పరిస్థితుల ప్రాబల్యంవల్ల కొందరు దొంగలు అవు తారు. అయితే అందరు దొంగల్లా చావరు. మీకు ఎంత డబ్బు కావలసినా ఇస్తాను. మీరు నాతో సహాకరించాలి.''

"అలాగే సర్."

"ధాంక్స్యూ. అడ్రసు ధర్మకు యిచ్చి వెళ్ళండి. అవసర మయినపుడు కబురు పంపుతాను."

ఇద్దరి ముఖాలు ఆనందంతో వెలిగాయి.

11

డిఫెన్స్ మినిస్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిపార్టుమెంట్, ఆర్మీ జనరల్ మేనేజర్లు, డిటెక్టివ్ పి. జె. అందరూ కూర్చొని వున్నారు.

డిఫెన్స్ మినిస్టర్ అన్నాడు. "ప్రస్తుత దేశభద్రత మనచేతుల్లో వుంది. ప్రపంచ ప్రమాదం ఓ రకంగా జోక్ అయినప్పటికి మేఘమాల పేలటం, వాగ్ 15 అంతర్ధానం కావటం, జలాంతర్గామి దొంగిలించటం, అందమయిన యువతులు అగమ్యగోచరం కావటం ఆలోచిస్తే, యధార్ధ మేమో అనిపిస్తుంది."

"ఎందరో జీనియస్ క్రైమ్ బ్రాంచి ఆఫీసర్లు పరిశోధించినమీదట రెండు నిర్ణయాలు తీసుకోబడ్డాయి. ఒకటి—యీ ప్రాజెక్టు సముద్రగర్భంలో వుందని, రెండు—ప్రపంచ ప్రమాదానికి యింకా కొద్దిరోజులు వ్యవధి వుందని," ఐ. జి. అన్నాడు.

పి. జె. తల ఊపాడు. "మనకు పట్టుబడ్డ సుందర్ స్టేట్‌మెంట్ ప్రకారం డాగర్ మవుంటెన్ అనేది హీరియోగ్రఫీలో లేదు. అది వాళ్ళు పెట్టుకున్న పేరు. ఇదే వాళ్ళ స్థావరం అని నిర్ణయించవచ్చు. ఆ కారణంగానే వాగ్ 15 దొంగిలించటం జరిగింది. డేని, గబ్బర్‌కు దొరికిన శవం గురించి ఆలోచిస్తే, యిది నిజమనిపిస్తుంది. ఇంత రహస్య మయిన స్థలంలో యీ కార్యక్రమం సాగిస్తున్నారంటే

దీనికి ఖచ్చితంగా వ్యవధి, కొంత ఆపరేషన్ అవసరం అనిపిస్తుంది.''

''ఇప్పుడు కర్తవ్యమేమిటి?'' ఐ. జి. అడిగాడు.

''సముద్రగర్భంలో దర్యాప్తు చేయటమే'' పి. జె. అన్నాడు.

''అంతకంటే మార్గంలేదు. మిస్టర్ పి. జె. యీ కార్యక్రమానికి నీవే పూనుకోవాలి. ఈ ప్రపంచ ప్రమాదం తప్పించే బాధ్యత నీపై వుంది,'' డిఫెన్స్ మినిస్టర్ అన్నాడు.

అందుకు పి. జె. సమ్మతించాడు.

12

వాలి సిగర్ వెలిగించి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. ప్రక్కనే పి. జె. కూర్చున్నాడు. వారి వెనుక యుగంధర్ మిర్రర్ ప్రక్కనే కూర్చొని బైనాక్యులర్ సరిచేసుకొని డైరి తెరిచాడు. నర్సన్ బయలుదేరిన చోటు పిన్ చేశాడు. ధర్మ వెనుకగా నిలబడ్డాడు. వైర్లెస్ ఆపరేటర్ చంద్రమోహన్ యియర్ ఫోన్స్ తగిలించుకున్నాడు. మాలిని, దేని, గబ్బర్ ఎవరిపనులలో వారున్నారు.

ఎర్రని బోర్డుమీద సబ్ మెరైన్ ఎంత లోతులో వెళుతుందో అంకెలు కనిపిస్తున్నాయి. సబ్ మెరైన్ యాభై కిలోమీటర్ల వేగంతో పోతుంది.

ఎండ ఎక్కువగా వుండటంవల్ల సూర్యకిరణాలు నీటిపై భాగంలోనుండి కాంతివంతంగా పడటంచేత ముప్పై మీటర్ల దూరం అన్నివైపుల కనిపిస్తుంది.

సబ్ మెరైన్ నేలకు మూడుమీటర్ల ఎత్తులో వెళుతుంది.

అప్పటికి రెండువందల మీటర్ల లోతు.

గవ్వలు ముక్కలయి అక్కడక్కడ మెరుస్తూ కని పిస్తున్నాయి. పీతలు అడ్డదిడ్డంగా పారిపోతున్నాయి. తాబేళ్ళు గభాలున ముడుచుకు కూర్చుంటున్నాయి.

అప్పటికి సబ్ మెరైన్ బయలుదేరి రెండుగంటలయింది.

డిటెక్టివ్ పి. జె. సిగరెట్ వెలిగించి, ఆలోచనలో పడ్డాడు. యుగంధర్, నర్సన్ మాప్ లో చూస్తూ వెళ్ళ వలసిన దారి పిన్ చేస్తున్నారు.

"ప్రొఫెసర్ దీర్ఘనాథ్, విశ్వామిత్ర భలే ప్రాంతం ఎన్నుకున్నారు" అన్నాడు వాలి.

అందరు తలలు ఊపారు.

13

ప్రొఫెసర్ విశ్వామిత్ర అందరిని పిలిచాడు. పిలుస్తు న్నట్లు బెల్ మ్రోగించాడు. ఆ బెల్ మ్రోగుతుంది కాబట్టి అందరు అక్కడకు వచ్చారు.

"డియర్ ఫ్రండ్స్. ఈ అత్యవసర సమావేశం ఎందు కంటే మన కార్యక్రమాలు చాలా తొందరగా ముగిం చాలి. హిట్లర్ ప్రపంచాన్నే జయించాలనుకున్నాడు. జయించినా చరిత్ర మారదు. కాని మనం ఆ చరిత్ర మార్చాలనుకున్నాం. కాని మనలో వున్న ఒకరిద్దరి అసమ ర్థులవల్ల మన స్థావరం తెలిసిపోయింది, ప్రభుత్వానికి. బాంబులతో మన స్థావరాన్ని ధ్వంసంచేయటం కుదరదు. కారణం మనం రెండువేల అడుగుల లోతులో వున్నాం కాబట్టి శక్తివంతమయిన బాంబు వినియోగించటానికి ఐక్యరాజ్యసమితి ఒప్పందం కావాలి. దానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కాని యిప్పుడు మన పథకాన్ని ధ్వంసం చేయటానికి ప్రఖ్యాత డిటెక్టివ్ పి. జె. వస్తున్నాడు. పి. జె. దగ్గర చాలా శక్తివుంది. ఎముకల్ని పూడ్చి మనిషిని పైకితీసి ఆ మనిషితో నిజం చెప్పించగల మేధావి. మరొక గొప్ప మేధావి బైలాజికల్ ప్రొఫెసర్ యుగంధర్. సముద్రంలో ఏదో చెట్టువేరు తీసి చెప్పమంటే ఆ చెట్టు చరిత్ర చెప్పగల మేధావి. ఇక పోతే వాలి. బాంబుల మధ్య సబ్‌మెరైన్ నడిపి ప్రపంచస్థాయిలో ప్రభుత్వపు బహుమతి పొందిన మనిషి. వీరు గాక యింకా ఆరుగురున్నారు. వీరు 'డీప్‌స్టార్ 9' లో వస్తున్నారు."

రణగణధ్వని ఒకరికొకరు మాట్లాడుతున్నారు.

"అయినా భయంలేదు. మనం చాలా తొందరలో మన కార్యక్రమం ముగించాలి. అందుకే శక్తివంచన లేకుండా కృషిచెయ్యాలి."

"డియర్ ఫెర్నాండెజ్."

"యస్ కమేండర్."

"మనదగ్గర మిగ్ ప్లెయిన్ వుంది. నీతోపాటు శ్రీకాంత్‌ను తీసుకువెళ్ళు. మెగ్నటిక్ రిలే ప్రకారం సబ్‌మెరైన్ ఎక్కడవుందో చూడు. సబ్‌మెరైన్ పైకివచ్చిన వెంటనే బాంబింగ్ జరగాలి."

"యస్ కమేండర్."

14

"టచ్ అప్" అన్నాడు వాలి సిగర్ పొగవదులుతూ.

దేని సీట్లో కూర్చొని కుతూహలంగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. స్టెపిన్స్ వెనుకకు లాగాడు దేని, ధర్మ ప్లాటింగ్ స్పీడ్ చూశాడు. సబ్‌మెరైన్ క్రమంగా పైకి వెళుతుంది.

పి. జె. పెరిస్కోప్ క్రిందకులాగి చుట్టూ చూశాడు. సబ్ మెరైన్ వేపు దూసుకువస్తుంది మిగ్ ప్లెయిన్.

"టచ్ డౌన్" అరిచాడు పి.జె, ధర్మ స్టెపిన్స్ బలంగా తోశాడు. అప్పటికే దూసుకువస్తున్న మిగ్ ప్లెయిన్ బాంబులు వేస్తుంది. నీళ్ళు అల్లకల్లోల మవుతున్నాయి. వాలి గబాలున డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

అందరు కంగారుగా బయటకు చూస్తున్నారు. నీళ్ళ బుడగలు, నురుగులు సుడులు తిరుగుతున్నాయి. ఫ్లోటింగ్ రెండువందల మీటర్లకు పెరిగింది. క్షణాలలో సబ్ మెరైన్ అడుగుకు చేరింది.

అందరు నిట్టూర్చారు.

నేలలోనుండి విచిత్రమయిన శబ్దం ప్రారంభమవుతుంది, శబ్దంతోపాటు యిసుకపై బుడగలు ప్రారంభమయ్యాయి. ఆ బుడగలు పైకిపోతున్నాయి. అక్కడక్కడ ఇసుక రేగుతుంది. చేపలు కంగారుగా పరుగెడుతున్నాయి. విచిత్రమయిన ఆ శబ్దంతో భూమి కదులుతున్నట్లుంది. ఆందోళనగా కంగారుగా అందరు చూస్తున్నారు.

"మూడు వందలు" ఆశ్చర్యంగా అన్నాడు పి. జె. ప్రవాహ వేగం మూడువందల బోర్డు చూసి. ఇసుక పైభాగంలో వున్న గడ్డిముక్కలు లేస్తున్నాయి. పై భాగానికి వెళుతున్నాయి. ఇసుక పైభాగంలో చారలు ప్రారంభమయ్యాయి.

"భూకంపం వస్తుంది" యుగంధర్ అరిచాడు.

"భూకంపమా?" దేని ఆశ్చర్యంగా అన్నాడు.

సబ్ మెరైన్ నూటయాభై మైళ్ళ వేగంతో దూసుకు పోతుంది.

అందరి గుండెలు గుబగుబ లాడుతున్నాయి. ముఖాలు రంగులు మారాయి. నీటిసాంద్రత ప్రవాహవేగం మారి పోయింది. భయంకరమయిన శబ్దం వినిపించింది. సగంగా చీలిపోయింది సముద్రం లోయలా ఏర్పడింది. సబ్‌మెరైన్ ఎంత వేగం హెచ్చించినా ప్రవాహవేగం ఐదువందలు పెరగటంతో వెనకకు నెడుతుంది.

"వెనుకభాగంలో భూమి చీలివుంటుంది" యుగంధర్ అన్నాడు.

"యస్. యస్" అన్నాడు పి. జె.

సబ్‌మెరైన్ అటు యిటు వూగిపోతుంది. రెండు వైపులకు కదలటంతో అందరు అటు యిటు ఒరిగిపోతున్నారు. పెద్దపెద్ద చాపలు సబ్‌మెరైన్‌కి ఢీకొంటున్నాయి.

"నీరు ఎగుడుదిగుడుగా ప్రవహించటంతో తిరగబడే ప్రమాదం వుంది" అన్నాడు యుగంధర్. అయినా శక్తివంతంగా వాలి సబ్‌మెరైన్‌ను నడుపుతున్నాడు.

మేగ్నటిక్‌రిలే విజిల్ వినిపించింది. మరొకప్పుడయితే గమనించే వాళ్ళుగాని ఇప్పుడా ఆలోచనలేదు. ముమ్ముంజి షిప్ దూసుకువస్తూ సబ్‌మెరైన్ కుడివైపు దూరింది. అలా దూరటంతో సబ్‌మెరైన్ ప్రక్కకు ఒరిగిపోయింది. క్షణంలో స్టడీలో వుంచినా లాభంలేదు. మళ్ళీ దొర్లి యధాస్థానానికి వచ్చింది.

అందరు వణకిపోతున్నారు.

పి. జె. మేగ్నటిక్‌రిలేవైపు చూసి "టరన్ దట్ సైడ్" అన్నాడు. వాలి తలూపి అటువైపుకు నడిపాడు.

కొద్దిదూరంలో విరిగి ముక్కలయిపోయిన విమానం కనిపించింది.

పి. జె. గబాలున లేచి ఎల్లో కలర్ న్యూక్యాబ్ వేసుకొని, దేనిని పిలిచాడు.

"లాభంలేదు పి. జె. మిషనరీ హీట్ ఎక్కింది. ఈ వేగంతో వుంటే పేలిపోతుంది. వదిలేస్తే అగాధంలో పడుతుంది" వాలి అన్నాడు.

"జస్ట్ ఎ మినిట్" అన్నాడు పి. జె.

నైలాన్ త్రాడు తీసుకొని ఒకటి తనకు దేనికి, కట్టి బయటకు వచ్చాడు "బి కేర్ ఫుల్ మై సన్" యుగంధర్ అన్నాడు.

ప్రవాహంలో జరిగిపోతూ విమానం దగ్గరగా వచ్చారు. పి. జె. త్రాడు విమానం బాడికివున్న ఇనుప కమ్మీలకు చుట్టాడు. దేని సహకరించాడు.

సబ్ మెరైన్ జరగటం ఆగిపోయింది. చెత్త, గడ్డి, చేపలు వచ్చి వారిని ఢీకొంటున్నాయి. ఇసుక ప్రవాహంతో వచ్చి సబ్ మెరైన్ పైన పడుతుంది. చెవులు చిల్లులు పడేటంత హోరు. నురగలు కక్కుతున్న నీరు.

ఆ నీరు పైభాగంలో పొర్లుతున్నట్లు కనిపించటంతో ప్లెయిన్ వెళ్ళిపోయింది. సబ్ మెరైన్ సముద్రంలో మునిగి పోయిందని తీర్మానించుకున్నారు.

వాలి అన్ని స్విచ్ లు ఆపాడు. పి. జె. దేని నైలాన్ త్రాడు పట్టుకొని అతి ప్రయత్నంమీద తిరిగి లోపలకు ప్రవేశించారు. మాలిని, చెరొక పెగ్ బ్రాంది అందించింది. "కంగ్రాచ్యులేషన్స్ పి. జె" అన్నాడు వాలి.

"మనం బతికినట్లేనా?" నర్సన్ అన్నాడు అనుమానంగా.

"కొన్ని క్షణాలు బ్రతుకుతాం" నవ్వాడు యుగంధర్.

"మిస్టర్ నర్సన్ మన ప్రయాణం ప్రాణాలతో చెలగాటం. ఎప్పుడు? ఎవరు? ఎలా? చనిపోతారో తెలియదు. మన ప్రాణాలుపోయినా పరవాలేదు. కాని మన ప్రాణాలు పోయే చివరిక్షణాలలోనైనా శత్రువుల్ని తుదముట్టించాలి" వాలి అన్నాడు.

"హియర్ ...హియర్" అన్నాడు గబ్బర్ సింగ్.

ప్రవాహపు వేగం క్రమంగా తగ్గుతుంది. అందరు బితుకు బితుకుమంటూ చూస్తున్నారు. పి. జె. విరిగిన విమానం చూస్తున్నాడు.

సమయం నాలుగుగంటలయింది.

ప్రవాహపు వేగం నూటపాతికవరకు తగ్గింగి. "గుడ్ సబ్ మిరైన్ కదల్చవచ్చు" అన్నాడు వాలి.

గబ్బర్, ధర్మ న్యూక్ర్యబ్స్‌తో బయటకు వెళ్ళారు' సబ్ మిరైన్ చుట్టూ యిసుక పేరుకొని వుంది. క్రమంగా తొలిగించి తాడు విప్పారు.

సబ్ మిరైన్ స్టార్ట్ చేయబోయాడు వాలి.

"బుల్ సిప్" అరిచాడు యుగంధర్. పి. జె. బయట వున్న ధర్మకు వస్తున్న చేపను చూపాడు. చేయి వినిరాడు రమ్మనట్లు వాళ్ళు అప్పటికి విరిగిన విమానం దగ్గర వుండటం చేత వాళ్ళు వచ్చేలోపు ఆచేప వచ్చే అవకాశంవుంది. "త్రాడు విప్పకపోతే బావుండేది"అన్నాడు యుగంధర్.

"యిప్పుడెలా?"

"లైట్స్ ఆర్పండి ఎవరూకదలవద్దు. ఎవరయినా కదిలితే బంతి ఆడినట్లు యీ సబ్ మిరైన్‌లో ఆడుతుంది," అన్నాడు యుగంధర్.

ధర్మ, గబ్బర్ ఆత్రతగా విరిగిపోయిన విమానపు బాడీలో దూరారు. లోపల అస్థిపంజరాలు కూర్చునట్లున్నాయి. చిన్న గుడ్డముక్కలు, నాచుపట్టిన కమ్మీలు కొన్ని చిన్న బాక్స్‌లు వున్నాయి.

బుల్ సిప్ రానే వచ్చింది. 'కిక్కర'మని అరుస్తూ సబ్‌మెరైన్ చుట్టూ తిరుగుతుంది. సబ్‌మెరైన్ అంత ఎత్తు వుంది. ఆ అరుపుకు సబ్‌మెరైన్ ప్రతిధ్వనిస్తుంది.

బుల్ సిప్ చేప చాలా అందంగా వుంది. సగం నల్లగా వుంది. సగభాగం వెన్నునుండి తెల్లని మచ్చలున్నాయి. తోక విశాలంగా వుంది. మాప్ గీసినట్లు గీతలువున్నాయి. వెన్నుపైన విసెనకర్రలాంటి ఈకలువుండి, పసుపురంగు చారవుంది. మొప్పల ప్రక్క పసుపురంగులో వింగ్స్.

సబ్‌మెరైన్ చుట్టూ తిరిగి విమానం దగ్గరకు వెళ్ళింది. అప్పుడే మరొక ప్రక్కనుండి వస్తున్న పెద్దచేపను చటుక్కున నోరు తెరిచి మింగింది. మళ్ళీ యీదుతూ విమానం బాడి దగ్గరకు వెళ్ళింది.

పి. జె. నిశితంగా చూశాడు. నోరు తెరిస్తే ఓమనిషిని సులభంగా మింగేస్తుంది.

ధర్మ, గబ్బర్ రెండు సీట్లమధ్య కూర్చున్నారు.

బుల్ సిప్ కదిలింది. మెల్లగా సబ్‌మెరైన్ వెనక భాగంలోనికి వచ్చి వెళ్ళిపోయింది.

యుగంధర్ నిట్టూర్చాడు. ధర్మ, గబ్బర్ ఆత్రతగా సబ్‌మెరైన్ లోపలకు ప్రవేశించారు.

15

"కాలింగ్ డీప్‌స్టార్ 9...కాలింగ్ డీప్‌స్టార్ 9..." నాలుగు సార్లు చంద్రమోహన్ పిలిచాక, కంట్రోల్ నుండి మెసేజ్ వచ్చింది. జరిగిన సంఘటనలు వివరించారు.

లోపల లైట్స్ వేశారు. మాలిని అందరికి బిస్కెట్స్ సప్లయి చేసింది.

కొన్ని నిమిషాల తరువాత యుగంధర్, వాలి పి. జె. విశ్రాంతికి ఉపక్రమించారు.

నర్సన్ మాప్ చూస్తు ఆలోచిస్తూ క్రేస్ గీస్తున్నాడు. దేని, ధర్మ సబ్‌మిరైన్ డ్రైవ్ చేస్తున్నారు.

"యింకా కొద్దిదూరంలో మనకు ప్రథమంగా కొండ అడ్డువస్తుంది. వైట్ మవుంటెన్" అన్నాడు నర్సన్.

అక్కడక్కడ చిన్నరాళ్ళు పెద్దరాళ్ళు అడ్డంగా వస్తు న్నాయి. ధర్మ దేనికి కాషన్స్ యిస్తూ నడుపుతున్నాడు. చిన్నచిన్న కొండ గుట్టలు పాతేసినట్లువున్న పాలరాళ్ళు కనిపిస్తున్నాయి. రాయి కాంతివంతంగా వుంది. అందువల్ల పరిసరాలు కాంతిగా మెరుస్తున్నాయి. అక్కడక్కడ లోయలు, మలుపులు వున్నాయి.

అంతలోనే ఎదురుగా వున్న దృశ్యం చూసి అందరి ముఖాలు వివర్ణమయ్యాయి.

కొన్ని పుర్రెలు ఎముకలు కొన్ని కొమ్మలకు వేలాడు తున్నాయి. మనిషి పుర్రలేగాక చాప అస్థిపంజరాలు, సీటి గుర్రం అస్థిపంజరాలు ఆ కొమ్మలకు వున్నాయి. ఎన్నిరకాల చెట్లు వుండటం చేత ఆ చెట్లు ఏమిటో అర్థం కాలేదు.

సబ్‌మిరైన్ ఆ చెట్టు ప్రక్కగా వెళుతోంది.

ప్రక్కనే వున్న చెట్టుఆకులు జీవం వున్నట్లు కదులు తున్నాయి. అలా కదులుతూనే కొమ్మలన్నీ ఒక్కసారిగా సబ్‌మిరైన్ వైపుకు వంగి సబ్‌మిరైన్‌ను చుట్టివేశాయి. ఏదో భయంకరమయిన శక్తి ఆపివేసినట్లు సబ్‌మిరైన్ ఆగి పోయింది. ఎంత ప్రయత్నించినా కదలటం లేదు.

యుగంధర్ ఆతృతగా వచ్చాడు. "ఓ గాడ్ డ్రాగో

ప్లీస్" అన్నాడు కంగారుగా. వాలి, వెనుక పి. జె. కూడా వచ్చాడు. "యింపాసిబుల్ సబ్‌మిరైన్ కదలదు" అన్నాడు యుగంధర్.

మూడువైపుల చెట్టుకొమ్మలు తప్ప ఏమీ కనిపించటం లేదు. యింజన్ ఎంత స్టార్ట్ చేసినా ప్రయోజనం లేదు. అద్దాలమీద పాముల్లాకొమ్మలు ఆడుతున్నాయి. కొంతసేపటికి ప్రొఫెలరు ఆగిపోయింది. ఏమాత్రం అవకాశం వున్నా అద్దాలు బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించాలని ప్రయత్నిస్తున్నట్లు వున్నాయి.

"యివి డ్రాగో చెట్లు. భూమిపై నరభక్షక చెట్ల జాతికి చెందింది. ఐదు మీటర్ల దూరంలో ఏవస్తువయినా తనలోనికి లాక్కుంటుంది. సబ్‌మిరైన్ ఎట్టి పరిస్థితిలోనూ కదలదు," అన్నాడు యుగంధర్.

"మరెలా?" నర్సన్ భయంగా అడిగాడు.

అందరు సందిగ్ధంలో పడ్డారు.

వీటినుండి తప్పించుకునే మార్గం లేదా?" దేని అన్నాడు.

"మనం యిక్కడే చావవలసిందేనా?" భయంగా నర్సన్ ముఖం పెట్టాడు.

"నీలాంటి పిరికి మనిషిని తీసుకురావటమే తప్పు." చిరాగ్గా అన్నాడు వాలి.

పి. జె. మిర్రర్ దగ్గరకు నడిచాడు. కొమ్మలు మరీ హుషారుగా కదులుతున్నాయి. ఏదో శబ్దంతో గసపెడుతున్నాయి.

"సూక్ర్యూబ్స్" అన్నాడు పి. జె.

"వద్దు పి. జె. చాలా ప్రమాదం! కొమ్మ తగిలిందంటే అమాంతంగా లేపి నల్లిని నలిపినట్లు నలిపివేస్తాయి" యుగంధర్ వారించాడు.

"పర్వాలేదు ప్రొఫెసర్! చాలా జాగ్రత్తగా వుంటాను ఐ ట్రయ్ మై బెస్ట్" అంటూ స్కూబ్ ధరించాడు.

"నేను వస్తాను పి. జె" అన్నాడు వాలి.

"నో సర్. మీరు డ్రైవింగ్ సీటులో కూర్చోండి. ధర్మ, దేని నాతో వస్తారు," అన్నాడు పి. జె.

ముగ్గురూ స్కూబ్స్ ధరించారు. అందరికీ భయంగా కంగారుగావుంది. మాలిని కళ్ళు తడి అయ్యాయి.

"మీరు అద్దాలు దగ్గరగా వెళ్ళండి" అన్నాడు పి. జె. మూడు అడుగుల పొడవుగల కత్తులు తీసుకున్నారు. మెల్లిగా క్రింద డోర్ తెరిచాడు పి. జె. ఒక కొమ్మ గబాలున దూసుకు వచ్చింది. కత్తితో ఒక్క వేటు వేశాడు. కొమ్మ తెగి తెల్లని ద్రవం, సన్నపొగ వచ్చింది.

పైన సబ్‌మెరైన్‌లో అద్దం దగ్గరగా అందరు వుండటంతో కొమ్మలన్నీ పైభాగంలో కదులుతున్నాయి. పి జె నీళ్ళలో దిగే ముందు చుట్టూ చూశాడు. కొమ్మలన్నీ పైకే వున్నాయి. ధర్మ, దేనికి సిగ్నల్ యిచ్చాడు. ముగ్గురు మెరుపులా యీది, చెట్టు కాండంని గబగబ నరికివేశారు. కొమ్మలు కదిలి దేనిని చుట్టాయి. ధర్మ నరికివేశాడు. కాండం తెగిపోవడంతో చెట్టుకొమ్మలు నిర్జీవంగా వాలి పోయాయి.

"హాయ్" అరిచారు అంతా.

"జీనియస్" యుగంధర్ అన్నాడు.

పి. జె. ధర్మ, దేని తిరిగి సబ్‌మెరైన్‌లో ప్రవేశించారు.

వాలి సబ్‌మెరైన్ స్టార్ట్ చేసి, వేగంగా దిశ మార్చి డ్రైవింగ్ చేశాడు. ఎన్నో డ్రాగో చెట్లు వున్నా ఏఒక్క దానికి అందకుండా ఆ కొండ మలుపు తిప్పిదాటించారు.

16

"కాలింగ్ డీప్ స్టార్ 9...కాలింగ్ డీప్ స్టార్ 9" కొన్ని నిమిషాల తరువాత కంట్రోల్ నుండి మెసేజ్ వినిపించింది.

"హౌ యీజ్ యువర్ పొజిషన్"

"నౌ వుయ్ ఆర్ ఓ. కె."

"దిస్ యీజ్ డేంజరస్ మెసేజ్ టుయూ. యింకా నాలుగైదు గంటలలో తుఫాను వస్తుంది. ప్రస్తుతం మీకు వెయ్యి కిలోమీటర్ల దూరంలో వుంది. బి కేర్ ఫుల్!"

అందరి ముఖాలు మాడిపోయాయి.

పి. జె. బరువుగా నిట్టూర్చాడు.

"విశ్వామిత్రతో ప్రమాదం ఎదుర్కొనటం ఎలా వున్నా, యీ ప్రమాదం చాలా భయంకరంగా వుంది" అన్నాడు ధర్మ ఆలోచిస్తూ.

"యిప్పుడు మనం ఎంత దూరం వచ్చాం?" పి. జె. ప్రశ్న.

"రెండువేల నూటయాభై కిలోమీటర్లు" నర్సన్ అన్నాడు.

"శత్రువుల స్థావరం యింకా ఎంతదూరం వుండవచ్చు."

"ఏడువందల కిలోమీటర్లలోపు వుండాలి."

మేప్ చూశాడు పి. జె. వైట్ మవుంటెన్ ప్రక్కగా మరొక మవుంటెన్ వుంది. "యిప్ నోవ్స్ మవుంటెన్."

"యీ కొండలో కేవ్స్ వున్నాయా?" పి. జె. ప్రశ్నించాడు.

"యస్ చాలావున్నాయి. అయితే ప్రమాదకరమయిన జంతువులు కూడా వున్నాయి."

"అయినా పరవాలేదు. యీ ప్రమాదంనుండి తప్పుకో

వాలంటే ఏదైనా గుహలో సబ్‌మెరైన్ను దాచటం మంచిది. వాయు గండం దిశమారి యిలాగే వస్తే సబ్‌మెరైన్ దానితోపాటు మనం నీళ్ళపాలవుతాం. గో యెహెడ్" అన్నాడు పి. జె. అప్పటికే తుఫాను ప్రారంభమైన సూచనలు కనిపిస్తున్నాయి.

సబ్‌మెరైన్ వెయ్యి ఐయిదువందల మీటర్ల లోతులో వెళుతుంది. రెండువందల కిలోమీటర్ల వేగం, అదేవేగంతో నీటి ప్రవాహం వుంది. అక్కడక్కడ షుమారయిన చేపలు ఎదురయి తప్పుకుంటున్నాయి. నాచుపట్టిన రాళ్ళ గుట్టలు, గుట్టలపైన పుట్టగొడుగులులాంటి మొక్కలు వున్నాయి.

అక్కడ ఒక పెద్ద కొండగుహలో సబ్‌మెరైన్‌ను ఆపి అందరూ విశ్రాంతి తీసుకున్నారు. ఇరవై నాలుగు గంటల తర్వాత తుఫాను తగ్గి, సముద్రంలో తిరిగి ప్రశాంతత ఏర్పడింది.

17

సబ్‌మెరైన్ వేగంగా నడుస్తుంది. వాలి చేతి రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. పి. జె. సిగరెట్ వెలిగించాడు.

మాగ్నెటిక్ రిలేవిజల్ వినిపించింది.

అందరు కుతూహలంగా చూశారు. మాగ్నెటిక్ రీడింగ్ చూపించింది. "సమీపించాం" అన్నాడు పి. జె.

"ఉయ్ ఆర్ ఓకె స్టడీ నౌ" అన్నాడు వాలి. సీటులో కూర్చున్న ధర్మవైపు తిరిగి కాషన్ యిచ్చాడు.

సబ్‌మెరైన్ వేగం పెంచింది.

యుగంధర్ అందర్ని పిలిచాడు. "డియర్ ఫ్రెండ్స్. యిది ప్రపంచానికి ఎంత ఆపదో, మనకి అంతే ఆపద. యీ

సమయంలో మనప్రాణాల్ని కూడా లెక్క చేయకూడదు."

పి. జె. నవ్వాడు. "అలాగే ఈ కార్యక్రమంలో అందరు ప్రాణాలకి తెగించాలి. మనం చచ్చినా, ప్రపంచానికి కలుగబోయే ప్రమాదం తప్పాలి. ఇది ఆశయం."

"యస్. యస్" అన్నాడు నర్సన్.

మేగ్నటిక్ రిలే చూపినవైపు సబ్‌మిరైన్ వేగంగా దూసుకుపోతుంది. అంచలంచలుగా నీరు విడిపోతుంది. పి. జె. లోపలకు నడిచి స్టెచ్ గన్స్ స్టడీలో వుంచాడు. ధర్మను పిలిచి కొన్ని కాషన్స్ యిచ్చాడు.

మేగ్నటిక్ రిలేలో శబ్దం అధికమయింది.

దూరంగా వరుసగా వున్న చెట్లు చూచి "అది బౌండరీ" అనుకుంటూను అన్నాడు యుగంధర్. వరుసగా ఐదునుండి ఇరవై అడుగుల ఎత్తులోవున్న చెట్లు. దేని, గబ్బర్ నిశితంగా చూస్తున్నారు. అయితే ఆ చెట్లలో బాంబులు వున్నాయని ఏ ఒక్కరికి తెలీదు. అందుకే సబ్‌మిరైన్ దూసుకుపోతునే వుంది.

చంద్రమోహన్, "కంట్రోల్ స్టేషన్‌కు మెసేజ్ పంపితే బావుంటుంది" అన్నాడు.

"మనం తిరిగి వెళ్ళమని భయమా?" నవ్వాడు నర్సన్.

"కాదు. అత్యవసరంగా మనకు తోడుగా హెలికాప్టర్స్ రావచ్చునని, అందుకని."

"అయితే సబ్‌మిరైన్ పైకి వెళ్ళాలి" అన్నాడు నర్సన్.

"అలా వెళ్ళితే ఆగంతుకులు పైలెట్స్‌గా తిరుగుతూ వుంటే కోలాహలం జరగవచ్చు" అంది మాలిని.

పి. జె. వాలెట్‌లోనుండి సిగరెట్ తీసి వెలిగిస్తూ బయటకు చూశాడు. "టచ్ అప్" అరిచాడు కంగారుగా.

వాలి మెదడు మెరుపులా పని చేసింది. సేఫ్టీ లెఫ్టకు డౌన్ చేసి, స్టీరింగ్ త్రిప్పాడు. సబ్‌మెరైన్ గభాలున మలుపు తిరిగి వెనుకకు మళ్ళింది. "వాట్ పి.జె" అడిగాడు వాలి.

"ఆ చెట్లలో చూడండి," అన్నాడు.

చెట్లలో నల్లగా గ్యాస్ బూరలా పైకి తేలుతూ వుంది. వాటినుండి క్రిందకు ఒక తీగె కట్టి వుంది.

"అది అండర్ వాటర్ బాంబ్ అయివుండాలి!" అన్నాడు నర్సన్.యుగంధర్ బైనాక్యులర్స్‌తో చూశాడు.

"ఒక్క క్షణం ఆలస్యమయితే ఈపాటికి మనం మిగిలే వాళ్ళం కాదు" అన్నాడు చంద్రమోహన్.

"ఇప్పుడేమిటి చేయటం ఎలా దాటటం."

"ఆ చెట్లకు పైగా పోవచ్చు. అభ్యంతరం లేదు," అన్నాడు పి. జె.

సబ్‌మెరైన్ బయలుదేరి చెట్లపైగా వెళ్ళి బౌండరీ దాటింది. సబ్‌మెరైన్ మళ్ళీ వేగం హెచ్చింది.

ఆక్సిజన్ అయిపోయింది" అంటూ నర్సన్ ఆత్రంగా వెళ్ళి ఆక్సిజన్ సిలిండర్ ఆన్ చేశాడు.

పి. జె. సిగరెట్టు ధర్మకు అందించాడు. ధర్మకు సిగరెట్ అందించాడంటే ఏదో ప్రమాదం రాబోతుందని సూచన. ధర్మ ఎలార్ట్‌గా వున్నట్లు, అర్థం చేసుకున్నట్లు, రివర్స్‌లో అగ్గిపుల్ల వెలిగించాడు.

ఏదో గాస్ సబ్‌మెరైన్ అంతా నిండిపోతుంది. అప్పటికి నర్సన్ మూడుసార్లు పైకి చూశాడు. "మిస్టర్ పి. జె. చెక్ ది ఆక్సిజన్" అన్నాడు వాలి సబ్‌మెరైన్ ఆపుచేస్తూ. పి.జె. లోపలకు వెళుతూ గభాలున తూలిపడి పోయాడు.

అప్పటికే సబ్ మెరైన్‌లో అంతా పడిపోయారు.

సబ్ మెరైన్ ఆగిపోయింది.

ఒక కొండగుహాలోనుండి కొందరు ఆగంతకులు పరుగెత్తుకు వచ్చి సబ్ మెరైన్ చుట్టుముట్టారు. హాహాకారాలు చేస్తూ, అందరు సబ్ మెరైన్‌లో వున్న ఒక్కొక్కరిని లోపలకు తీసుకెళ్ళిపోయారు. ఎవరూ స్పృహాలో లేరు.

18

ఒక్కొక్కరిని నిశితంగా చూసిన విశ్వామిత్ర "పి. జె. ఎక్కడ?" దాదాపు అరచినట్లుగా అడిగాడు. నర్సన్ విస్తుపోయాడు. "మిస్టర్ నర్సన్! చాలా శ్రమతో మాకు యీ పథకానికి సహాకరించినందుకు ధన్యవాదాలు."

నర్సన్ నవ్వాడు. ధర్మ కళ్ళలో నెత్తురు చారలు కట్టింది. యుగంధర్ పెదవులు బిగించాడు. వాలి పళ్ళు కొరికాడు. డేని గుప్పిడిపట్టాడు. గబ్బర్ ముఖం కందగడ్డలా అయింది.

"అయితే పి. జె. తప్పించుకోవటం ఆశ్చర్యంగా వుంది."

"మీరు యిచ్చిన గాస్‌తో అందరూ స్పృహాకోల్పోయారు."

"పి. జె. కోల్పోయాడని అనుకున్నావ్ కాని పి. జె. మాస్టర్ ఆఫ్ ఆల్ టైమ్. ఎక్కడ? ఎప్పుడు? ఎలా వుండాలో పి. జెకి తెలుసు. పి. జె. ఎక్కడో వుండి వుండడు. ఈ కొండ పరిసరాలలోనే వుంటాడు. నెంబర్ సెవెన్" పిలిచాడు.

"యస్ కమేండర్."

"మనదగ్గర వున్న ఆక్టోపస్‌లను వదిలివేయి."

"ఆక్టోపస్‌లు మీ దగ్గర వున్నాయా?" నర్సన్ ఆశ్చ

ర్యంగా అడిగాడు.

"యస్ నర్సన్. రెండు ఆక్టోపస్‌లను బంధించాం. ఆక్టోపస్ సముద్రగర్భంలో భయంకరమయిన జంతువు. తల పది అడుగులు వ్యాసంతో. ఎందరో మనుషులు యీ ఆక్టోపస్‌కు ఆహుతి అయ్యారు. ఇది మనిషిని తొండంతో చుట్టి రక్తం పీలుస్తుంది. తన తొండంనుండి వూరే సెలివరీ గ్రంథులనుండి వచ్చే విషద్రవంవల్ల మనిషి శక్తివిహీను డవుతాడు. నెంబర్ 7 డు యువర్ డ్యూటీ."

"యస్. కమేండర్."

"నెంబర్ టెన్. నీవు వీళ్ళందరిని ఎలక్ట్రిక్ రూంలో వుంచు. మిస్టర్ ధర్మ మీరు కేవలం కూర్చునేటందుకు ఆరు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు చెక్క వుంటుంది. చుట్టూ ఇనుపతీగతో అల్లిన బోను అది. కాలు క్రింద పెడితే కరెంట్ షాక్ తగిలి మనిషి నల్లగా అయిపో తాడు. గుర్తు తెలియని వికృతరూపం వస్తుంది. మిమ్మల్ని చంపి పారేయగలము. కాని యిప్పుడు మా కార్యక్రమం ఒకటి వుంది."

"మిస్టర్ దీర్ఘనాథ్! మనం తయారుచేసిన పాయిజన్ సీసాలలో ఎక్కించి వేయండి! క్విక్!"

"యస్ కమేండర్."

"ఇంకా యాభైనిమిషాలలో మన కార్యక్రమం అమలు జరగాలి," అంటూ ముందుకు నడిచాడు.

19

నర్సన్ ఆక్సిజన్ మార్చటంతో ఓ రకమయిన వాసన ప్రారంభమయింది. పి. జె. గ్రహించి, ధర్మకు తెలియ చేశాడు. ఇద్దరు శ్వాస ఆపివేశారు. నర్సన్ కూడా అందరిలా స్పృహ కోల్పోవటంతో తను స్కూబ్

ధరించాడు. స్టెచ్‌గన్ పట్టుకొని, సబ్‌మెరైన్ అడుగు భాగంలో డెక్ క్రింద దాక్కున్నాడు.

అందరిని బంధించి లోపలకు తీసుకువెళ్ళారు.

పి. జె. అది కొండ అని, అందులో చాలా పెద్ద గుహ వుండివుంటుందని, వాగ్ 15 ద్వారా నీళ్ళను దూరంచేసి ప్రాజెక్టు కట్టారని వూహించాడు. ఆ కొండచుట్టూ ఒక సారి స్విమ్ చేసాడు.

కొండరాయి మలుపు తిరుగుతూ వుండగా ఆక్టోపస్ శబ్దం వినిపించింది. వెంటనే తన తొండాన్ని చాచింది. పి. జె. కొండపైనున్న ఒక్కొక్క రాయి చాటుగా దాక్కుంటున్నాడు. ఆక్టోపస్ భయంకరమయిన సాలి పురుగులా వస్తుంది. పి. జె. గబగబ స్విమింగ్ చేస్తూ రాయి దాటాడు. కాని అప్పటికే బలమయిన తొండం పి. జెను చుట్టుకుంది.

ఆక్టోపస్ మరో తొండం మెడచుట్టింది. మిగిలిన ఆరు కాళ్ళు నీళ్ళపై ఆడుతున్నాయి. దాని తొండాలకు వున్న సెలివరీ ద్రవం పి. జె. స్క్యూబ్ మీదగా జారుతుంది. పి. జె. స్టిచ్‌గన్ శ్రమతో స్టడీలోవుంచి ఆక్టోపస్ నోట్లో వదిలాడు. వికృతంగా అరచిన ఆక్టోపస్ తొండం వదిలింది.

పి. జె. గబగబ రెండవవైపుకు వెళ్ళాడు. ఆ గుహలో మూడువైపుల డోర్స్ వున్నాయి. ఒక డోర్ తెరిచాడు. ఇంకో ఐదు అడుగులదూరంలో మరొక డోర్ వుంది. అండర్ వాటర్‌లో డబుల్‌డోర్స్ అవసరం. రెండు డోర్స్ మధ్యచేరిన నీరు బయటకు పంపింగ్ అవుతాయి. రెండు డోర్స్ ఒక్కసారే తెరిస్తే నీరు ధాటిగా లోపలకు పోతుంది. రెండు డోర్స్ మధ్య ఆగి స్టిచ్‌గన్ స్టడీలో వుంచాడు.

సెంట్రీ ఒకడు లోపల డోర్ తెరిచాడు. లోపల అడుగుపెట్టటంతో పి. జె. స్టిచ్‌గన్‌తో సెంట్రీ తలపై కొట్టాడు. గబగబ ఆ యూనిఫాం తను ధరించాడు. లోపల ప్రాజెక్ట్‌లో ప్రవేశించాడు.

ఆ మిషనరీ చూసిన పి. జె. విస్తుపోయాడు.

వరుసగా ఆరు రాకెట్లు వున్నాయి. ఒక్కొక్క రాకెట్ ఆరు అడుగుల పొడవు మాత్రం వుంది. గోల్డ్ కలర్‌లో తళతళ మెరిసిపోతున్నాయి. మరోకప్రక్క జనరేటర్, కంప్యూటర్స్ వున్నాయి. ఇంకోవైపు టెలిస్కోపు, డాష్‌బోర్డ్ వున్నాయి. కొంతమంది ఆపరేట్ చేస్తున్నారు. పదిమంది మిషన్‌గన్స్‌తో అక్కడ కాపలా కాస్తున్నారు.

అంతలో ప్రొఫెసర్ విశ్వామిత్ర మైక్‌లో అంటున్నాడు. "డియర్ ఫ్రండ్స్ యింకా అరవై నిమిషాలలో ప్రపంచ ప్రమాదం జరుగుతుంది. ఇప్పుడు దీర్ఘనాథ్ ఆరు సీసాలు ఆరు రాకెట్ల పైభాగంలో పెడతారు. ఈ ఆరు రాకెట్లు, పైభాగంలోవున్న అద్దపు చట్రాన్ని పగలకొట్టి ఆకాశంలోనికి దూసుకుపోతాయి. ఆరు మహాసముద్రాల్లో పడిపోయిన వెంటనే ఒక చుక్క మందు వంద కిలో మీటర్ల నీటిను విషంగా మారుస్తుంది.

ఆ నీరు మేఘాలుగా మారుతుంది. అప్పుడు సరైన టెంపరేచర్ ఈ పాయిజన్స్‌కు వస్తుంది. ఆ మేఘాలు వర్షాలుగా కురిసినపుడు ప్రపంచంలో ప్రతి నీటి చుక్క విషంగా మారుతుంది. అదే ప్రపంచ ప్రమాదం. ఈ రాకెట్లు వదిలేటందుకుగాను సాగరగర్భంలో ఈ ప్రాజెక్టు నిర్మించాం."

"హియర్...హియర్" చప్పట్లు మారుమ్రోగాయి.

20

ధర్మ సిగరెట్ వెలిగించి ఆలోచిస్తున్నాడు. పి. జె. ఏమయ్యాడో తెలియటంలేదు. చుట్టూ పది అడుగుల దూరంలో యినుపచట్రం వుంది. ఒకవైపు డోర్ వుంది.

డోర్ తెరుచుకుంది. క్రరతో వున్న ట్రాలినుండి కాఫీ, టిఫిన్ వచ్చింది. ఎక్కడో స్విచ్ నొక్కి వుండాలి, అనుకున్నాడు ధర్మ. కంప్యూటర్ మిషన్‌లా వచ్చేసింది.

"తొంభై... ఎనభైతొమ్మిది... ఎనభై ఎనిమిది" రీడింగ్ వినిపిస్తుంది. రాకెట్ వదిలేటందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు అనుకున్నాడు ధర్మ.

ధర్మ గభాలున ట్రాలిపై ఎక్కాడు. ట్రాలి బోనును దాటటం, ఓ ధృఢకాయుడు రివాల్వర్‌తో ఎదురుగా నిలబడటం ఒకేసారి జరిగాయి. ధర్మ ఎటు కదలినా ఎలక్ట్రిక్ ఫెన్స్ తగులుతుంది.

"మిస్టర్ ధర్మ. మేము జాలిపడి టిఫిన్ యిస్తే పారి పోరిపోతావా? ఐ కిల్ యు బాస్టర్డ్" అంటూ రివాల్వర్ పేల్చబోయాడు.

అదేసమయంలో యుగంధర్ తను టిఫిన్ చేస్తున్న పింగాణి ప్లేట్ విసిరాడు. అది ధృఢకాయుడు చేతికి తగిలి రివాల్వర్ క్రిందపడింది.

వాడు కళ్ళు ఎర్రచేసి ధర్మనుచూసి రెండు చేతులతో మెడచుట్టాడు. ధర్మ చేతులు క్రిందకు లాగుతూ నడుం దగ్గర రెండువేపుల కొట్టి ఒక చెయిపట్టుకొని జూడో ఫైట్ చేసినట్లు దొర్లించాడు. ధృఢకాయుడు ఎగిరి ఎలక్ట్రిక్ ఫెన్స్‌పై పడ్డాడు. క్షణంలో హాహాకారాలతో నల్లగా మారిపోయాడు. కరెంట్ ఫీజులు పోయాయి.

యుగంధర్, వాలి ఒకవైపు దేని, గబ్బర్ మరొక వైపు తప్పుకున్నారు. ధర్మ ఒక్కొక్క చోటు దాటు కుంటూ ఎదురయిన మనిషిని శబ్దంరాకుండా చంపే స్తున్నాడు.

క్షణంలో కోలాహలం అయింది. మిషన్‌గన్స్ స్టెన్ గన్స్‌తో ఫైరింగులు ప్రారంభమయ్యాయి. హాతులదగ్గర తీసుకున్న గన్స్ అందరికి సప్లయిచేశాడు ధర్మ.

విశ్వామిత్ర కంగారయాడు. "ఫైర్" అరిచాడు.

పి. జె. గబాలున అడ్డువచ్చి "విశ్వామిత్ర! దిస్ ఈజ్ ఫైనల్."

"నీ వెనుక చూడు మిస్టర్ పి. జె" వికృతంగా నవ్వాడు విశ్వామిత్ర.

"అవసరంలేదు. నీ గాంగ్ చాలామంది నాకు గన్స్ పెట్టారు. అయినా ఫరవాలేదు. ప్రపంచ శ్రేయసుకొరకు ప్రాణాలు యిస్తాను. కాని నీ ప్రాణం తీస్తాను."

"యూ బాస్టర్డ్" అరిచాడు విశ్వామిత్ర.

పి. జె. నవ్వాడు. "నీ వెనకాల చూడు" అన్నాడు. ప్రక్కనే యుగంధర్, వాలి, వెనుక ధర్మ నిలబడి వున్నారు. "నా ధర్మ చాలు మీ అందర్నీ చంపటానికి." అన్నాడు.

విశ్వామిత్ర కళ్ళతో సైగచేశాడు. వెనుక మిషన్‌గన్స్ పేలాయి. అప్పటికే పి. జె. క్రిందకువంగి ప్రక్కనేవున్న కంప్యూటర్ చాటుకు వెళ్ళిపోయాడు.

అప్పుడే ధర్మ కాల్చబోయాడు. దీర్ఘనాథ్ రివాల్వర్ పేలటంతో అది ధర్మను దూసుకుపోయి, ధర్మ ఒరిగి పోయాడు. పి. జెకి మతిపోయినట్లయింది. కాని క్షణంలో

వాలి స్టెచ్‌గన్ దీర్ఘనాథ్ గుండెల్లో దూసుకుపోయింది. యుగంధర్, ధర్మను ఎత్తాడు. చేతిలోనుండి రక్తం కారుతుంది.

పారిపోయిన విశ్వామిత్ర వాగ్ 15 దగ్గరకు పరుగెత్తాడు. ఒకప్రక్క దేని, మరొకప్రక్క గబ్బర్ రివాల్వర్ చూపి, విశ్వామిత్రను బంధించారు. ముఠా అంతా చాలామంది చనిపోయారు. మిగిలినవాళ్ళు సరెండర్ అయిపోయారు.

—: ఐపోయింది :—